తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
28-07-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 170
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575




# న్యాయ వ్యవస్థనే ధిక్కరిస్తారా?

- హైడ్రా కమిషనర్ పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని సీఎస్ ఆదేశం
- తక్షణమే మరో ఐజీ స్థాయి అధికారిని నియమించాలి
- కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ధర్మాసనం సీరియస్
- కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం సరికాదని వ్యాఖ్య

**హైదరాబాద్, జూలై 27 (సిరి న్యూస్):**
నగరంలో కూల్చివేతలు, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. హైడ్రా కమిషనర్, సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తక్షణమే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా లోతుకుంట పరిధిలోని సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమికి సంబంధించిన కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణ సందర్భంగా

మిగతా 3వ పేజీలో..

# మిడ్జిల్ మోడల్ తరహాలో
## సంగారెడ్డి సిటీ2 సబ్‌స్టేషన్ ఆధునీకరణ

- 64 ఏళ్ల తర్వాత సబ్‌స్టేషన్‌కు సరికొత్త రూపు
- భద్రత, విశ్వసనీయత, నిర్వహణ ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు
- 3x8 ఎంవీఏ సామర్థ్యం.. 9 ఫీడర్లు..
- 35 వేల మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా

2




## హైదరాబాద్‌లో మానవరహిత ఇండోర్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం



- స్థలాభావానికి వినూత్న పరిష్కారం
- ముషీరాబాద్‌లోని స్టీల్ ఫ్లైఓవర్ కింద మోడల్ సబ్‌స్టేషన్‌కు ప్రణాళిక
- రూ.10-12 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక విద్యుత్ కేంద్రం
- పూర్తి భద్రతా ప్రమాణాలతో ఆర్టీయూ ఇంటిగ్రేషన్

3



## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

- యశోద ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కేసీఆర్.
- వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకుని, కుటుంబానికి ధైర్యం చెప్పిన కేసీఆర్.
- గుండెపోటు రావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు.

**హైదరాబాద్, జూలై 27, (సిరి న్యూస్):**
మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కి చేరుకున్నారు. కేసీఆర్ యశోద హాస్పిటల్

మిగతా 2వ పేజీలో..



## పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కావాలి

- మహేశ్వరం ఈ-సిటీ పార్కు సందర్శించిన సీఎస్

3

## విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

- ఉచితాలు కావు.. ప్రజా పెట్టుబడులు
- ఏ బిడ్డా ఆర్థికలేమితో బడికి వెళ్లొద్దు
- పాలన అంటే పెత్తనం కాదు.. సమాజ హితం
- 'పీపుల్స్ మార్చ్' నుంచే ప్రజాహిత ఇందిరమ్మ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

3



## మెట్రో స్టేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

- స్వచ్ఛత, పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దు
- తొలి విడతలో 10 స్టేషన్లను ఎంపిక చేసి సమగ్ర అభివృద్ధి చేపట్టాలి
- అధికారులను ఆదేశించిన హెచ్ఎంఆర్ఎల్ అదనపు ఎండీ అజిత్ రెడ్డి

2





## దర్యాప్తులో 'ఫోరెన్సిక్' నివేదికలే కీలకం

- డీజీపీ ఆనంద్
- 57 మంది ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ఉద్యోగులకు నియామక పత్రాలు

2


## కేసీఆర్ మొండి వైఖరితోనే సింగరేణికి తీరని అన్యాయం

- బొగ్గు బ్లాకుల విషయంలో నిర్లక్ష్యంతో సంస్థ వెనుకబడింది: కిషన్ రెడ్డి
- సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపణ
- కొత్త బొగ్గు బ్లాకులు దక్కితే 6,500 ఉద్యోగాలు వస్తాయని వెల్లడి
- జెన్‌కో పోటీ నుంచి తప్పకుని సింగరేణికి అవకాశం కల్పించాలని సూచన
- పేపర్ లీకేజీల నివారణకు కఠిన చట్టం తీసుకొచ్చామని స్పష్టం

2



## బంగాఖాతంలో అల్పపీడనం



- తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం

2



## మహంకాళి బోనాలకు శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

**హైదరాబాద్, జూలై 27, (సిరి న్యూస్):**
సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆషాఢమాస బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని ఐటీ, పరిశ్రమల శాఖ

మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రంలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్‌కు శ్రీకారం

- ప్రభుత్వ సేవల కోసం ఒకే ధ్రువపత్రం.. కొత్త విధానానికి తెలంగాణ సర్కార్ నిర్ణయం
- రేషన్ కార్డు ఆధారంగా ఎలక్ట్రానిక్ కుటుంబ రిజిస్టర్
- మీ-సేవ, ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు అవకాశం
- రెండు రోజుల్లో డిజిటల్ సంతకంతో ధ్రువపత్రం జారీ
- కుటుంబ సభ్యుల వివరాల ధ్రువీకరణకే సర్టిఫికెట్ వర్తింపు

**హైదరాబాద్, జూలై 26, (సిరి న్యూస్):**
ప్రభుత్వ పథకాలు, సేవలు పొందే సమయంలో పౌరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ ' విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ విధానం అమల్లోకి వస్తే కుటుంబ సభ్యుల వివరాల కోసం వేర్వేరు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. కొత్త విధానం ప్రకారం ప్రస్తుతం అమల్లో ఉన్న ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) డేటాబేస్‌తో అనుసంధానించి ఎలక్ట్రానిక్

మిగతా 2వ పేజీలో..





# మెట్రో స్టేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

**హైదరాబాద్, జూలై 27 (సిరి న్యూస్):**

మెట్రో ప్రయాణం ప్రజలకు మరింత సులభతరం అయ్యేలా తగు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం బేగంపేట్ స్టేషన్ నుండి రాయదుర్గ్ మెట్రో స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించిన ఆయన.. స్టేషన్లు, వాటి సమీపంలోని వీధి స్థాయి సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బేగంపేట్, అమీర్‌పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్ల ప్లాట్‌ఫారమ్‌లు, కాంకోర్సులను సందర్శించి ప్రయాణికులకు అందుతున్న సేవలను ఇంజినీర్లు, కియోలిస్ సంస్థ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీధి స్థాయిలో ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాయదుర్గ్ వద్ద స్కైవాక్, ఐటీ కంపెనీలకు మెట్రో నుంచి ఉన్న మార్గాలు, మైండ్ స్పేస్ జంక్షన్‌లో ప్రయాణికుల రాకపోకలను పరిశీలించి రద్దీ వేళల్లో మరింత ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లర్ల మధ్య సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. స్వచ్ఛత, నాణ్యతలో ఎటువంటి రాజీ ఉండకూడదన్నారు.

మెట్రో స్టేషన్లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు స్థానిక ప్రణాళికలు రూపొందించాలని అజిత్ రెడ్డి ఆదేశించారు. ప్రయోగాత్మకంగా మొదట 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి, అవి అన్ని విధాలా అభివృద్ధి చెందేలా వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. తాను రానున్న రోజుల్లో మిగిలిన స్టేషన్లను కూడా దశలవారీగా పర్యవేక్షించి, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో హెచ్‌ఎంఆర్ చీఫ్ ఇంజినీర్ వై. సాయప రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే. శ్యామ్ మోహన్, జనరల్ మేనేజర్ (సెక్యూరిటీ) శ్రీనాథ్ రెడ్డి, డీఎస్పీలు జగన్నాథ్ రెడ్డి, శివరామి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# దర్యాప్తులో 'ఫోరెన్సిక్' నివేదికలే కీలకం

**హైదరాబాద్, జూలై 27, (సిరి న్యూస్):**

నేరాల దర్యాప్తులో నేరస్థుడిని ఎంత కష్టపడి పట్టుకున్నా, శాస్త్రీయ ఆధారాలు, ఫోరెన్సిక్ సైన్స్ నివేదికలు పటిష్టంగా లేకపోతే కోర్టులో కేసులు బలహీనపడే అవకాశం ఉంటుందని తెలంగాణ డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ అన్నారు. నేర నిరూపణలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన 57 మంది ఫోరెన్సిక్ ఉద్యోగులకు సోమవారం డీజీపీ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో అమల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా శాస్త్రీయ దర్యాప్తు ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫోరెన్సిక్ నిపుణులు అందించే నివేదికలే చార్జిషీట్‌కు కోర్టులో కేసు నిరూపణలో ప్రధాన ఆధారమవుతాయని, వీటికి ప్రాధాన్యం అత్యంత ఎక్కువగా ఉంటుందని డీజీపీ తెలిపారు. శాస్త్రీయ ఆధారాలు బలంగా లేకపోతే నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకునే అవకాశాలు ఉంటాయని అన్నారు. కోర్టు విచారణ విధానం, సాక్ష్యాలను ప్రవేశ పెట్టడంలో , కొత్త చట్టాల ప్రకారం పాటించాల్సిన నిబంధనలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఫోరెన్సిక్ నివేదిక అత్యంత నాణ్యతతో, నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని చెప్పారు. పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా ప్రస్తుతం ఫోరెన్సిక్ సిబ్బంది సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అవసరమైన ఆధునిక పరికరాలు, కెమికల్స్, ఇతర మెటీరియల్‌ను సమకూర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. నూతనంగా నియమితులైన 57 మందిలో 36 మంది పీహెచ్‌డీ, 15 మంది ఎంటెక్ పట్టభద్రులు ఉండటం సంతోషకర విషయమని డీజీపీ పేర్కొన్నారు. వారి విద్యార్హతలు ఫోరెన్సిక్ విభాగ సామర్థ్యాన్ని మరింత పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు

.ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్య కార్యదర్శి & టీజీఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ.. పరిమిత సిబ్బందితోనే ఫోరెన్సిక్ ల్యాబ్ 80 శాతానికి పైగా కేసులను పరిష్కరిస్తోందన్నారు. దేశంలో అత్యధికంగా ఫోరెన్సిక్ నివేదికలను అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని తెలిపారు. 2025లో మొత్తం 18,647 కేసులను పరిష్కరించి 86 శాతం డిస్పోజల్ రేటు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రాధాన్య కేసుల్లో నిర్ణీత గడువులోనే ఫోరెన్సిక్ నివేదికలు అందజేస్తున్నామని వివరించారు. డీఎన్ఏ విశ్లేషణ, కంప్యూటర్ ఫోరెన్సిక్స్, నార్కోటిక్స్, టాక్సికాలజీ తదితర విభాగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. డిజిటల్ సాక్ష్యాల పరిశీలన, మాదకద్రవ్యాల కేసుల పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ల్యాబ్‌ను మరింత ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ సంస్థలతో కలిసి పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటూ గుర్తింపును కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన 57 మంది సైంటిఫిక్ ఆఫీసర్స్ లో 36 మంది పీహెచ్‌డీలు, 12 మంది ఎంఎస్సీ, ఆరుగురు ఎం.టెక్, ముగ్గురు ఎంసీఏ పట్టభద్రులు ఉన్నారు. వీరి నియామకంతో ల్యాబ్ సామర్థ్యం మరింత పెరిగి, పోలీసు శాఖకు శాస్త్రీయ ఆధారాలతో కూడిన వేగవంతమైన ఫోరెన్సిక్ సేవలు అందనున్నాయని అధికారులు తెలిపారు. టీజీఎఫ్ఎస్ఎల్‌కు ఎన్ఏబీఎల్ గుర్తింపు లభించగా, సమాచార సాంకేతిక చట్టం-2000లోని సెక్షన్ 79ఏ కింద ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రభుత్వ పరీక్షా సంస్థగా గుర్తింపు పొందింది. 57 మంది శాస్త్రీయ సిబ్బంది నియామకంతో తెలంగాణలో ఫోరెన్సిక్ సామర్థ్యాలు మరింత బలోపేతమై, నేరాల దర్యాప్తు వేగవంతం కానుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ జాయింట్ డైరెక్టర్లు మధుశ్రీ, రవికుమార్ గౌడ్, దార్మిత, అసిస్టెంట్ డైరెక్టర్లు తో పాటు ఉన్నతాధికారులు, తెలంగాణ పోలీస్ శాఖ అధికారులు, నూతనంగా నియమితులైన ఉద్యోగులు పాల్గొన్నారు.



# మిడ్జిల్ మోడల్ తరహాలో సంగారెడ్డి సిటీ-2 సబ్‌స్టేషన్ ఆధునీకరణ

**సంగారెడ్డి, జూలై 27, సిరి న్యూస్ :**

తెలంగాణ లోని దక్షిణ మండలి విద్యుత్ సంస్థలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశలో భాగంగా సబ్‌స్టేషన్లలో భద్రత, విశ్వసనీయత, పరిశుభ్రత, నిర్వహణ ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా టీజీఎస్పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సీఎండీ జితేష్ వి. పాటిల్ సూచనల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్ సబ్‌స్టేషన్‌ను ఆదర్శంగా తీసుకుని సంగారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని సిటీ2 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆధునీకరించారు. 1962లో ఏర్పాటైన ఈ సబ్‌స్టేషన్ ఆరు దశాబ్దాలకు పైగా విద్యుత్ సేవలు అందిస్తోంది. ప్రస్తుతం ఇందులో 8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన మూడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, 9 ఫీడర్ల ద్వారా సుమారు 35 వేల మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. సబ్‌స్టేషన్ వయస్సు, ప్రస్తుత విద్యుత్ అవసరాలు, పరికరాల భద్రత, నిర్వహణ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమగ్ర ఆధునీకరణ పనులు చేపట్టారు. సబ్‌స్టేషన్‌లో దీర్ఘకాల వినియోగంతో అరిగిపోయిన, తుప్పుపట్టిన క్లాంపులు, ఫిట్టింగులను గుర్తించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. తద్వారా విద్యుత్ కనెక్షన్ల పటిష్టతను మెరుగుపరిచి, పరికరాల సురక్షిత నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టారు. సబ్‌స్టేషన్ ప్రాంగణంలోని పొదలు, అనవసర వృక్షాలను తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. స్విచ్‌యార్డులో అవసరమైన ప్రాంతాల్లో మెటల్ స్ప్రెడింగ్, గ్రావెల్ ఫిల్లింగ్ పనులు నిర్వహించారు. ఎర్తింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన చోట్ల ఎర్త్ కాలర్లు ఏర్పాటు చేశారు. భద్రతను మరింత పెంచేందుకు అవసరమైన ప్రాంతాల్లో వెల్డెడ్ ప్రొటెక్టివ్ మెష్ ఏర్పాటు చేశారు. తద్వారా అనధికార ప్రవేశాన్ని నిరోధించడంతో పాటు సబ్‌స్టేషన్ యార్డు భద్రతను మెరుగుపరిచారు. మట్టి కోతకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మించి నిర్మాణ స్థిరత్వాన్ని మెరుగుపరిచారు. దెబ్బతిన్న సివిల్ నిర్మాణాలకు మరమ్మతులు చేపట్టి ప్లాస్టరింగ్ పనులు పూర్తి చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణాలు, పరికరాల సపోర్టులు, భవనాలకు పెయింటింగ్ చేపట్టి తుప్పు ప్రభావం నుంచి రక్షణ కల్పించారు. పరికరాలు, ఫీడర్లు, ఇతర విద్యుత్ వ్యవస్థలను సులభంగా గుర్తించేందుకు కొత్త నేమ్ బోర్డులు, ఐడెంటిఫికేషన్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో సబ్‌స్టేషన్ ప్రాంగణం పరిశుభ్రంగా, క్రమబద్ధంగా, సురక్షితంగా రూపుదిద్దుకుంది.







## ప్రతి సబ్‌స్టేషన్ ఆదర్శంగా ఉండాలి: సీఎండీ


ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సబ్‌స్టేషన్లు కీలకమైనవని, వాటి సామర్థ్యంతో పాటు భద్రత, విశ్వసనీయత, పరిశుభ్రత, నిర్వహణ సౌలభ్యానికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సబ్‌స్టేషన్లలో పరికరాలు, క్లాంపులు, విద్యుత్ కనెక్షన్లు, ఎర్తింగ్ వ్యవస్థ, యార్డు భద్రత, సివిల్ నిర్మాణాల పరిస్థితిని క్రమం తప్పకుండా పరిశీలించి అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మిడ్జిల్ సబ్‌స్టేషన్‌లో అమలు చేసిన ఉత్తమ నిర్వహణ విధానాలను ఆదర్శంగా తీసుకుని, ఇతర సబ్‌స్టేషన్లను కూడా దశలవారీగా ఆధునీకరించాలని సూచించారు. ఆధునీకరణ అంటే కేవలం సుందరీకరణ మాత్రమే కాదని, విద్యుత్ పరికరాల భద్రత, సిబ్బంది సురక్షిత పని వాతావరణం, నిర్వహణ సౌలభ్యం, విద్యుత్ సరఫరా విశ్వసనీయతను మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

**సమన్వయంతో అభివృద్ధి:**

సంగారెడ్డి సిటీ2 సబ్‌స్టేషన్ ఆధునీకరణకు సంబంధించి సివిల్, ఆపరేషన్ అధికారులు కలిసికట్టుగా కొత్త రూపు తీసుకువచ్చారు. సంగారెడ్డి ఏడీఈ లక్ష్మణ్ పర్యవేక్షణలో స్విచ్‌యార్డు భద్రత, ఎర్తింగ్ వ్యవస్థ, విద్యుత్ కనెక్షన్ల పటిష్టత ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపారు. 64 ఏళ్ళ తర్వాత సబ్ స్టేషన్ కొత్త రూపు తీసుకు రావడానికి అధికారులను ఏడీఈ లక్ష్మణ్ సమన్వయం చేశారు. దీంతో మౌలిక వసతులు, నిర్వహణ సౌలభ్యం, ప్రాంగణ పరిశుభ్రత మరింత మెరుగుపడ్డాయి.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**హైదరాబాద్, జూలై 27, (సిరి న్యూస్) :**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశాపశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్‌సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి. కురువాల్సి ఉండగా, 109.7 మి. కురిసిందని తెలిపింది.

# రాష్ట్రంలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్‌కు శ్రీకారం


**మొదటిపేజీ తరువాయి**

కుటుంబ రిజిస్టర్‌ను నిర్వహించనున్నారు. రేషన్ కార్డు సంఖ్యనే కుటుంబ రిజిస్టర్ గుర్తింపు సంఖ్యగా పరిగణిస్తారు. ఇందులో కుటుంబ పెద్ద పేరు, సభ్యుల వివరాలు, వయస్సు, చిరునామా వంటి సమాచారం నమోదై ఉంటుంది. ఈ సర్టిఫికెట్ కోసం మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. కుటుంబంలోని ఏ వయోజన సభ్యుడైనా దరఖాస్తు సమర్పించవచ్చు. తహసీల్దార్ రేషన్ కార్డు డేటాతో వివరాలను పరిశీలించిన అనంతరం రెండు రోజుల్లో డిజిటల్ సంతకంతో కూడిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అయితే ఈ ధ్రువపత్రం కేవలం కుటుంబ సభ్యుల వివరాల నిర్ధారణ కోసం మాత్రమే ఉపయోగపడుతుందని అధికారులు స్పష్టం చేశారు. దీని ద్వారా ఆస్తి హక్కులు, చట్టబద్ధ వారసత్వ హక్కులు లేదా ప్రభుత్వ పథకాల అర్హత స్వయంగా లభించదని పేర్కొన్నారు. కొత్త విధానం ద్వారా ప్రభుత్వ సేవల కోసం అవసరమైన ధ్రువపత్రాల ప్రక్రియ మరింత సులభతరం కానుందని అధికారులు భావిస్తున్నారు.

# మహంకాళి బోనాలకు శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆలయ పాలకమండలి సభ్యులు ఆహ్వానించారు. సచివాలయంలో మంత్రిని సోమవారం కలిసిన పాలకమండలి ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆగస్టు 2న జరిగే బోనాల ఉత్సవం, 3న నిర్వహించే రంగం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఈవో మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామతీర్థ శర్మ, వేణుమాధవ శర్మ వేద మంత్రోచ్చారణలతో మంత్రిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవీవరప్రసాద్, మంత్రి సోనాల్, మల్లికార్జున్, గంటా గీత, కిరణ్ ముప్పిడి తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

**మొదటిపేజీ తరువాయి**

వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు.

# కేసీఆర్ మొండి వైఖరితోనే సింగరేణికి తీరని అన్యాయం

**హైదరాబాద్, జూలై 26, (సిరి న్యూస్):**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొండి వైఖరి, తప్పుదోవ పట్టించిన నిర్ణయాల వల్లే సింగరేణి సంస్థకు తీరని అన్యాయం జరిగిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బొగ్గు గనులను పారదర్శక వేలం ద్వారా కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రక్రియలో పాల్గొనకపోవడంతో సింగరేణి కొత్త బొగ్గు బ్లాకులను కోల్పోయిందన్నారు. ఫలితంగా సంస్థ విస్తరణ అవకాశాలు దెబ్బతిన్నాయని, ఆదాయ వనరులు తగ్గిపోయాయని ఆరోపించారు. కేంద్రం అందించిన రూ.525 కోట్ల నిధులను కూడా సక్రమంగా వినియోగించలేకపోయారని విమర్శించారు.

ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను 2015లోనే కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోలేదని కిషన్ రెడ్డి అన్నారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం చొరవతో అన్ని అనుమతులు ఇప్పించిందని తెలిపారు. అలాగే తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయించామని, మణుగూరులోని మరో బొగ్గు బ్లాక్‌ను వేలంలో ఉంచినట్లు వెల్లడించారు.

మణుగూరు బొగ్గు బ్లాక్ వేలంలో తెలంగాణ జెన్‌కో సింగరేణికి పోటీగా పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కోను టెండర్ ప్రక్రియ నుంచి తప్పించి, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. మూడు కొత్త బొగ్గు బ్లాకులు సింగరేణికి లభిస్తే సుమారు 6,500 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో దాదాపు రూ.1.95 లక్షల కోట్ల టర్నోవర్ సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పబ్లిక్ పరీక్షల చట్టంపై స్పందించిన కిషన్ రెడ్డి, పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2024లోనే కఠిన చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భవిష్యత్తులో ఎవరూ పేపర్ లీక్‌లకు పాల్పడలేని విధంగా కఠిన శిక్షలను ఇందులో పొందుపరిచామని చెప్పారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన ఈ చట్టానికి సహకరించాల్సింది పోయి కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించడం బాధాకరమన్నారు.

పరీక్షల ఫలితాల తర్వాత కొంతమంది విద్యార్థులు నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, వారిలో ఆత్మవిశ్వాసం నింపాల్సిన బాధ్యత సమాజంపై ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఘటనపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ కొనసాగుతోందని, న్యాయ ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉందన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

**మధిర, జూలై 27, (సిరి న్యూస్) :**

ఉచిత పథకాలు అనేవి ఈ రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. మిడిమిడి జ్ఞానంతో చాలామంది ఉచిత పథకాలపై విమర్శలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరిశ్రమలు, ప్రాజెక్టులు, ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరిపై ప్రభుత్వం పెట్టుబడి పెడుతుందని అన్నారు. ఈ పెట్టుబడి ఫలితాలు ప్రజలు అభివృద్ధి చెంది ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేసేవిగా ఉంటాయన్నారు. మధిర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ బిడ్డా కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్ల కూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన, శుచిశుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బడ్జెట్ లో ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నియోజకవర్గంలో ప్రారంభించినట్లు చెప్పారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉదయంపూట సంతృప్తికరంగా బ్రేక్ ఫాస్ట్ చేసి బిడ్డలు చక్కగా చదువుకోవాలనే ఉద్దేశంతో రుచికరమైన, శుచిశుభ్రతతో కూడిన న్యూట్రిషియస్ ఫుడ్ అందించాలని తమ కేబినెట్ నిర్ణయం మేరకు బడ్జెట్ లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. అర్ధాకలితో పాఠశాలకు వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠాలను సరిగ్గా వినలేక, ఆకలితో సతమతమవుతూ చదువు మీద దృష్టి పెట్టలేని పరిస్థితి ఏ విద్యార్థికీ రాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఏ రాష్ట్ర అభివృద్ధికైనా సహజ వనరులు ఎంత అవసరమో సమర్థవంతమైన మానవ వనరులు కూడా అంతే అవసరమని భట్టి విక్రమార్క వక్కాణించారు. అత్యంత ప్రతిభావంతులుగా తయారైన మానవ వనరులు ఉన్న రాష్ట్రం గాని, దేశం గాని ప్రపంచంలో అత్యంత శక్తివంతంగా మారుతుందని అన్నారు. వజ్రాల్ని తయారు చేసుకోవాల్సిన తరుణంలో మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్నిరాష్ట్రవ్యాప్తంగా తలపెట్టే కార్యక్రమానికి నాంది పలికామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు ఒకటే సమయానికి వేడిగా అల్పాహారం అందించడం అంటే ఇది ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం.. ఈ దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లెక్కించాల్సిన అంశం అని చెప్పారు. ఏ దేశంలోనూ, ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున అల్పాహారం అందించే వ్యవస్థ లేదని భట్టి పేర్కొన్నారు. సంకల్పం మంచిదైతే భగవంతుని ఆశీస్సులు ఉంటాయని, అందుకే సాధ్యం కాదనుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రభుత్వం సాధ్యం చేసి చూపిందని డిప్యూటీ సీఎం తెలిపారు. హరే కృష్ణ మిషన్ భాగస్వామ్యంతో పకడ్బందీగా, అత్యంత శుభ్రమైన వాతావరణంలో మెకనైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మధిరలోని తాత్కాలిక సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 16 మండలాల స్కూళ్లకు వాహనాల్లో అల్పాహారం అందిస్తున్నామన్నారు. రాబోయే మ□డు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత కిచెన్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించనున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. పిల్లలకు అందించే అల్పాహారంతో పాటు పౌష్టికాహారం కోసం వారానికి మ□డు రోజులు పాలు, మరో మ□డు రోజులు రాగి జావను ప్రత్యేకంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. బడి పిల్లలతో కలిసి భోజనం చేయడం తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత తృప్తిని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. పాలన అంటే ఒక హోదా కాదు. అధికారం అంటే పెత్తనం చలాయించడం కాదు.. అధికారమన్నా, పాలనన్నా ఉన్న వనరుల్ని పోగేసి సమాజ హితం కోసం ప్రణాళికలు తయారు చేయడం.. వారి అభివృద్ధికి పునాదులు వేయడం అని చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని వారి కోసం రూ.5 లక్షలతో ఒక్కొక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం జరుగుతున్నదన్నారు. గృహ ప్రవేశానికి మనం వెళ్లినప్పుడు ఆ పేదవాళ్ల కళ్లల్లో ఆనందం చూస్తే ఇది కదా పాలన అనే అనుభూతి కలుగుతోందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు తాను చేసిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూశానని భట్టి చెప్పారు. ఆ సమయంలో బడుల దుస్థితి, నిరుద్యోగుల ఆవేదన, ఇల్లు లేని పేదల బాధలను విన్నానని చెప్పారు. ఆనాడే తన మనసులో రూపుదిద్దుకున్న ఆలోచనలే నేడు ఒక్కొక్కటిగా పథకాలుగా మారుతున్నాయని భావోద్వేగానికి లోనవుతూ ఉప ముఖ్యమంత్రి చెప్పారు.



**ప్రజల జీవితాల్లో మార్పే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం**

విధానపరమైన నిర్ణయాలతో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వాటి నిర్మాణానికి రూ.22,500 కోట్ల నిధులు విడుదల చేశామని తెలిపారు. ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ప్రారంభించడం తన రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన నిర్ణయమని అన్నారు. పభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బలహీనవర్గాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసాతో లక్షలాదిమంది రైతుల ఖాతాల్లో రూ.9,000 కోట్లు జమ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. మహిళలను మహాలక్ష్ములుగా గౌరవిస్తూ ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వారికి ఆర్థిక భారం తగ్గించామని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏడాదికి రూ.20,000 కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రెండున్నరేళ్లలో రూ.67,000 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించామని, ఐదేళ్లలో ఈ మొత్తం రూ.లక్ష కోట్లకుపైగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతీ కుటుంబానికి ఏడాదికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేలా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నాణ్యమైన సన్న బియ్యం తినాలనే లక్ష్యంతో కోటి 6 లక్షల కుటుంబాలకు ప్రతి సభ్యునికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్య గౌరచంద్ర దాస ప్రభుజీ, ఫౌండేషన్ సీఈవో కౌంతేయ స్వామీజీ, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, కార్పొరేషన్ చైర్మన్లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

**కార్యక్రమం సైడ్‌లైట్స్**

- విద్యార్థులకు అల్పాహారంతోపాటు అందించే మిల్క్ యూనిట్‌ను భట్టి విక్రమార్క ప్రారంభించారు.
- ఈ కార్యక్రమం దిగ్విజయంగా ముందుకు సాగాలని నృసింహ మహా యాగం చేయగా అందులో పాల్గొన్నారు.
- అల్పాహారం తయారు చేసే యంత్రాలను, కూరగాయ లాంజ్ శుద్ధి చేసే యంత్రాలను, ఇతర న్ని ఏర్పాట్లను పరిశీలించారు.

- విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఇడ్లి, పొంగల్, ఉప్మా, పూరీ, రాగి ఇడ్లి, ఇతర వంటకాలను రుచి చూశారు.

- విద్యార్థులకు వంటకాలను వడ్డించగా ఆయనతో మాట్లాడేందుకు, చేయి కలిపేందుకు విద్యార్థులు ఎంతో ఉత్సాహాన్ని చూపారు.
- వివిధ పాఠశాలలకు అల్పాహారాన్ని అందించే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.
- సభ ప్రారంభంలో విద్యార్థులు రాష్ట్ర గీతాన్ని ఆలపించగా వాతావరణం ఉద్వేగంగా మారింది. చిన్నారులను అభినందించారు.
- సభలో పాల్గొన్న విద్యార్థులు మొత్తం భట్టి.. భట్టి అంటూ నినాదాలు చేయడం విశేషం.

# న్యాయ వ్యవస్థనే ధిక్కరిస్తారా?

**మొదటిపేజీ తరువాయి**

హైకోర్టు ఈ సంచలన తీర్పు వెలువరించింది. ఈ విచారణలో భాగంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేసి హైకోర్టుకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. లోతుకుంట వివాదాస్పద భూమిలోకి హైడ్రా సిబ్బంది ప్రవేశించలేదని, ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని, పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. అయితే, ఈ వివరణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. రంగనాథ్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉండటాన్ని తీవ్రంగా పరిగణించింది. సెక్రటరీ హోదాలో ఉన్న ఒక ఉన్నతాధికారి కోర్టు ఆదేశాలను ఇన్నిసార్లు ఉల్లంఘించడం సమంజసం కాదని తేల్చిచెప్పింది. ఇలాంటి అధికారి ఆ పదవిలో కొనసాగడం సరికాదని స్పష్టం చేసిన హైకోర్టు.. ఏవీ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, ఆయన స్థానంలో అర్హత కలిగిన మరో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ఆదేశించింది. న్యాయస్థానం తీసుకున్న ఈ కీలక నిర్ణయం రాష్ట్ర రాజకీయ, అధికార వర్గాలలో సంచలనం సృష్టించింది.




# పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కావాలి

**హైదరాబాద్, జూలై 27, (సిరి న్యూస్) :**

పారిశ్రామికాభివృద్ధి మరింత వేగం తీసుకురావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మహేశ్వరం ఈసిటీలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను, ప్రీమియర్ ఎనర్జీస్ ఫొటో వోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్, అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమ, మంఖాల్ పారిశ్రామిక పార్కును, ఎం/ఎస్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమలను సంజయ్ జాజు సోమవారం సందర్శించారు. పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించారు. ముందుగా మెసర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ ఫొటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించారు. సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారు చేస్తోన్న ఈ పరిశ్రమ లో ప్రస్తుతం 1,200మంది పనిచేస్తున్నారు. అనంతరం ఎం/ఎస్ అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సీ.ఎస్ సందర్శించారు. ఈ పరిశ్రమ హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రధానంగా చేపడుతోంది. రూ.59.22 కోట్ల పెట్టుబడి గల ఈ సంస్థలో 400మంది పనిచేస్తున్నారు. మంఖాల్ పారిశ్రామిక పార్కులో మెసర్స్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్ర మను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ రూ.284.02 కోట్ల పెట్టుబడితో 500మందికి ఉపాధి కల్పిస్తోంది.




అనంతరం మహేశ్వరం జనరల్ పార్కులోని మెసర్స్ విప్రో ఎంటర్‌ప్రైజెస్(ప్రై) లిమిటెడ్‌ను సందర్శించారు. ఈ యూనిట్ రూ.17,434 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 331 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎం/ఎస్ మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సంజయ్ జాజు సందర్శించారు. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.37,405 లక్షల పెట్టుబ డితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 2,782మందికి ఉపాధి కల్పిస్తోంది. ఆయన వెంట టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణ మోడల్ స్కూల్ సందర్శన**

మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సీఎస్ సంజయ్ సంద ర్శించి విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌక ర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొంటూ ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్షించిన ఆయన విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల సమయాల్లో విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ బస్సు సేవలను పాఠశాల వరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. శశాంక్, కృష్ణ ఆదిత్య జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# “నీ కోరిక తీరిందా రాహుల్?”...

- **కమిషనరేట్‌లో మనుసు కదిలించే దృశ్యం!**
- **‘పోలీస్’ కావాలన్న కలను నిజం చేసిన మల్కాజిగిరి సీపీ సుమతి**
- **ఒక్కరోజు పోలీస్ అధికారిగా అవకాశం**
- **దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ దయ చూపాలని పిలుపు**

**మేడ్చల్/ దమ్మాయిగూడ, (సిరి న్యూస్) :**

పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న దమ్మాయిగూడకు చెందిన రాహుల్ చిరకాల కోరికను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి నెరవేర్చారు. సమాజంలో పోలీసులంటే ఉండే కరకుతనాన్ని కాకుండా, వారిలోని కరుణను చాటిచెప్పే అద్భుత ఘట్టానికి మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ వేదికైంది. ఒకరోజైనా పోలీస్ అధికారిగా కుర్చీలో కూర్చోవాలని కలలు కన్న రాహుల్ ను కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి సీపీ సుమతి ఆహ్వానించి తన కుర్చీలో కూర్చోబెట్టి పోలీస్ టోపీ ధరింపజేశారు. “నీ కోరిక తీరిందా రాహుల్?” అంటూ ఆప్యాయంగా పలకరించగా, ఆనందంతో చిరునవ్వులు చిందించిన రాహుల్ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి వలస వచ్చిన తిరుమలరావు-రాధమ్మ దంపతుల కుమారుడు రాహుల్ పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. రెండు కాళ్లు ఉన్నప్పటికీ నడవలేని పరిస్థితి, మాటలు కూడా సరిగా మాట్లాడలేని స్థితిలో ఉండటంతో కుటుంబానికి భారంగా మారాడు.ఈ విషయాన్ని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత దృష్టికి తీసుకెళ్లగా, రాహుల్‌కు వీల్‌చైర్‌ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రాహుల్ కోరిక నెరవేరడంతో అతని తల్లిదండ్రులు సీపీ బాడుగుల సుమతి, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత, మెరుగు శివకృష్ణలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**స్వచ్ఛంద సంస్థలు అంకితభావంతో పనిచేయాలి : పోలీస్ కమిషనర్ సుమతి**

స్వచ్ఛంద సంస్థలు పేద ప్రజల కోసం అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉండిపోతారని నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించాలని బడుగుల సుమతి స్వచ్ఛంద సంస్థల నేతలతో అన్నారు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలను వికలాంగులను అంగవైకల్యాకులను మూగ చెవిటి వారిని ఆప్యాయంగా పలకరించి సోదర భావంతో మెదగాలని బడుగుల సుమతి కోరారు స్వచ్ఛంద సంస్థలు సొసైటీలో ఎప్పటినుండో ప్రజలకు చేరువై ఎన్నో సేవ కార్యక్రమాలను చేయడంపై అభినందించారు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దామరపల్లి నర్సింహారెడ్డి , చింతల విజయ్ కుమార్, జినుక రఘు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మానవరహిత ఇండోర్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం

**హైదరాబాద్, జూలై 27 (సిరి న్యూస్):**

హైదరాబాద్‌లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఎదురవుతున్న స్థలాభావ సమస్యకు టీజీఎస్పీడీసీఎల్ వినూత్న పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నగరంలో సాంకేతికంగా అనువైన ఫ్లైఓవర్ల కింద అందుబాటులో ఉన్న స్థలాలను వినియోగించి ఆధునిక కాంపాక్ట్ ఇండోర్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. సోమవారం ముషీరాబాద్ బస్ డిపో సమీపంలోని నాయని నర్సింహారెడ్డి స్టీల్ ఫ్లైఓవర్ కింద పిల్లర్ నం.6364 మధ్య ప్రతిపాదిత 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ) వి. శివాజీతో కలిసి పరిశీలించారు. ప్రతిపాదిత స్థలం, సబ్‌స్టేషన్ లేఅవుట్, 33 కేవీ ఇన్‌కమింగ్ సరఫరా, 11 కేవీ అవుట్‌గోయింగ్ ఫీడర్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్ మార్గాలు, భద్రతా ప్రమాదాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో భూముల విలువ విపరీతంగా పెరగడం, అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడం ప్రధాన సవాళ్లుగా మారాయి. ఈ నేపథ్యంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ సిఫారసుల మేరకు ఫ్లైఓవర్ల కింద స్థలాలను ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. దీనిద్వారా ప్రత్యేకంగా భూసేకరణ వ్యయం (రూ.810 కోట్లు) భారీగా తగ్గడంతో పాటు, కేవలం రూ.1012 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తవుతుందని సీఎండీ తెలిపారు.

**ప్రజల భద్రతకే అత్యధిక ప్రాధాన్యత**

ఇటువంటి ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని సీఎండీ స్పష్టం చేశారు. ఫ్లైఓవర్ స్టీల్ నిర్మాణాలకు విద్యుత్ ప్రభావం చేరకుండా ఎలక్ట్రికల్ ఐసోలేషన్, ఎర్తింగ్, ఇన్సులేషన్, రక్షణ వ్యవస్థలను అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తామన్నారు. సమగ్ర సాంకేతిక అధ్యయనం, భద్రతా పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే పనులు చేపడతామని తెలిపారు. ఈ పరిశీలనలో చీఫ్ ఇంజనీర్ (మెట్రో జోన్) కరుణాకర్ బాబు, ఎస్ఈ రమేష్, డివిజనల్ ఇంజనీర్లు శ్రీనాథ్, వినోద్ కుమార్, ఏడీఈలు సంజయ్, కర్మాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మత్తులో పోలీసులపైకి కారుతో దూసుకెళ్లిన యువకుడు

**హైదరాబాద్, జూలై 26, (సిరి న్యూస్):**

డ్రగ్స్ మత్తులో ఓ యువకుడు పోలీసులపైనే కారుతో దాడికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. డ్రగ్స్ కొనుగోలు జరుగుతోందన్న సమాచారంతో అబిడ్స్‌లో నిఘా పెట్టిన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (హెచ్‌న్యూ) పోలీసులపై నిందితుడు కారును దూసుకెళ్లడంతో కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మరో కానిస్టేబుల్, ఇన్‌స్పెక్టర్ కూడా గాయపడగా, నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, హెచ్‌న్యూ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు జరుగుతోందన్న సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అక్కడ నిఘా ఏర్పాటు చేసింది. ఈ సమయంలో బ్లూ రంగు బెలెనో కారు పాయల్ ఫుట్‌వేర్ సమీపానికి చేరుకోగా, ఓ వ్యక్తి కారులో ఉన్న వ్యక్తికి అనుమానాస్పద ప్యాకెట్ అందజేశాడు. వెంటనే పోలీసులు ప్యాకెట్ అందించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌కు పోలీసులు తమ గుర్తింపు కార్డులు చూపించి వాహనం నుంచి దిగాలని సూచించారు. అయితే కారు ఆపుతున్నట్లు నటించిన సైఫ్ ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా వాహనాన్ని నడిపి పోలీసులపైకి దూసుకొచ్చాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి కారు వెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితుడిని వెంబడించిన హెచ్‌న్యూ బృందం అఫ్జల్‌గంజ్ వద్ద కారును అడ్డుకుని సైఫ్‌ను అదుపులోకి తీసుకుంది. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ వంశీధర్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. కాలు విరిగిన మహేందర్ యాదవ్‌ను వెంటనే సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## రాజకీయ కక్షతోనే వజ్రా రైస్ ఇండస్ట్రీపై దాడులు

### బీసీ సంఘం నాయకుడు రమేష్ యాదవ్



**మునిపల్లి, జూలై 27 (సిరి న్యూస్):**

సూర్యాపేటలో వట్టే జానయ్య యాదవ్‌కు చెందిన వజ్రా రైస్ ఇండస్ట్రీపై జరుగుతున్న చర్యలు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని బీసీ సంఘం నాయకుడు రమేష్ యాదవ్ ఆరోపించారు. మునిపల్లి మండల బుదేరాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. భువనగిరిలో ఇటీవల నిర్వహించిన భారీ సభను విజయవంతం చేయడంలో జానయ్య యాదవ్ కీలక పాత్ర పోషించారని, అలాగే ఈశ్వరమ్మపై కాంగ్రెస్ నాయకుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సూర్యాపేటలో జరిగిన ఆందోళనకు కూడా ఆయన నాయకత్వం వహించారని తెలిపారు. జానయ్య యాదవ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ప్రచారం చేస్తూ బీసీ నాయకులు ఎదగకుండా కొందరు రెడ్డి నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, బీసీ సమాజం ఐక్యంగా ఇటువంటి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు నరేష్, జనార్దన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త సమన్వయంతో పని చేయాలి

- బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి
- గుమ్మడిదల బీజేపీ మండల అధ్యక్షుడిగా చింతల యాదగిరి ఏకగ్రీవ ఎన్నిక
- మున్సిపల్ అధ్యక్షుడిగా రాజిరెడ్డి ఎంపిక



**గుమ్మడిదల, జూలై 27( సిరి న్యూస్):**

భారతీయ జనతా పార్టీ గుమ్మడిదల మండల అధ్యక్షుడిగా మంబాపూర్ గ్రామానికి చెందిన చింతల యాదగిరి వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం గుమ్మడిదల పురపాలక కేంద్రంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అదే విధంగా గుమ్మడిదల మున్సిపల్ అధ్యక్షుడిగా 18 వ వార్డు కౌన్సిలర్ రాజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసే బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ ఎల్లప్పుడూ ముందుండేలా కృషి చేయాలని, రానున్న రోజుల్లో గుమ్మడిదల మండలంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, మండల ఇన్‌చార్జి ఎడ్ల రమేష్, కుమార్, రాజన్న, లక్ష్మణ్, మండల సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన మేళాకు రైతుల వెల్లువ..

- ఎల్ నినోకు చెక్.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి..
- నెన్నెల్లో విత్తన మేళా.. రైతులకు అవగాహన..
- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులే లక్ష్యం..



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 27 (సిరి న్యూస్)**

వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు, ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా నెన్నెల్ మండలంలోని రైతు వేదికల్లో విత్తన మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, అధిక దిగుబడులు సాధించే సాగు విధానాలు, వాతావరణానికి అనుకూలమైన పంటల సాగుపై అవగాహన కల్పించారు. తక్కువ నీటి వనరులతో సాగు చేసే పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలను పొందాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను పాటిస్తూ లాభదాయకమైన పంటల వైపు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలేట్ సంధ్య, చిన్నోజి శంకరయ్య, గురునాథం మల్ల గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రైతులకు అవసరమైన సూచనలు అందిస్తూ విత్తనాలపై అవగాహన కల్పించారు.

# పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది

- ముగ్గురు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి.
- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి.
- మెదక్ జిల్లా ఎస్పీ.డి. వి.శ్రీనివాస రావు.

**మెదక్ జూలై,27(సిరి న్యూస్)**

పోలీస్ శాఖలో ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకు కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాస రావు పేర్కొన్నారు.మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఏఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్న రాంబాబు, జైపాల్‌రెడ్డి, కృష్ణ మూర్తిలకు ఎస్సైలుగా పదోన్నతి లభించిందన్నారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ పదోన్నతి పొందిన అధికారులకు ఎస్సై ర్యాంక్ చిహ్నాలను అలంకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుందని, అధికారులు తమ విధులను అంకితభావంతో, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ శాఖలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. నూతన బాధ్యతల్లో రాణిస్తూ పోలీస్ శాఖకు, ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు.



# గీతంలో నృత్య స్టూడియోల ప్రారంభం..





- నృత్యం–సంస్కృతి విడదీయరాని బంధం: కళైమామణి నందిని రమణి

**పటాన్చెరు, జూలై 27 (సిరి న్యూస్):**

ప్రముఖ భరతనాట్య కళాకారిణి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళైమామణి నందిని రమణి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్ఎస్)లో లలిత, ప్రదర్శన కళల విభాగం నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక నృత్య స్టూడియోలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా చేరిన విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో "నృత్యం, సంస్కృతి, సమాజం" అంశంపై ఆమె స్ఫూర్తిదాయక ఉపన్యాసం చేశారు. నృత్యం, సంస్కృతి, సమాజం మధ్య విడదీయరాని బంధం ఉందని, భారతీయ శాస్త్రీయ కళలు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రఖ్యాత నృత్య విదుషి టి. బాలసరస్వతితో తనకున్న అనుబంధాన్ని విద్యార్థులతో పంచుకుంటూ, భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాల విశిష్టతను వివరించారు. అనంతరం పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ రచించిన బెహాగ్ రాగంలోని జావళిని ప్రదర్శించి విద్యార్థులు, అధ్యాపకులను అలరించారు. ఆమె ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గీతం లలిత, ప్రదర్శన కళల విభాగం అధ్యాపకులు నందిని రమణికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె పర్యటన విద్యార్థుల్లో భారతీయ శాస్త్రీయ నృత్య వారసత్వంపై అవగాహన పెంపొందించడంతో పాటు కళల పట్ల మరింత ఆసక్తిని కలిగించిందని పేర్కొన్నారు.

# అబ్దుల్ కలాం ఆశయాలను యువత ఆచరించాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..
- పటాన్చెరులో మిస్సైల్ మ్యాన్‌కు ఘన నివాళులు

**పటాన్చెరు, జూలై 27 (సిరి న్యూస్):**

భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఆయన కాంస్య



విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలనే ఉద్దేశంతో కేజీ టు పీజీ విద్యా ప్రాంగణంలో అబ్దుల్ కలాం కాంస్య విగ్రహాన్ని తన సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి సమాజానికి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్‌టీఐ పగ్గాలు తోటకు.. కీలక బాధ్యతలు..

- జాతీయ కార్యదర్శిగా తోట శ్రీనివాస్ ఏకగ్రీవ ఎంపిక..
- ఆర్‌టీఐ ఉద్యమ బలోపేతానికి కొత్త బాధ్యతలు..
- పారదర్శక పాలనకు కట్టుబడి సేవలు: చంటి ముదిరాజ్..
- జాతీయ, రాష్ట్ర నాయకుల సమక్షంలో నియామక పత్రం అందజేత..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 27 (సిరి న్యూస్)**

సమాచార హక్కు చట్టం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ కార్యదర్శిగా తోట శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందజేశారు. జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం–2005 పరిరక్షణ, ప్రజల్లో అవగాహన పెంపు, పారదర్శక పాలన, జవాబుదారీతనం, అవినీతి నిర్మూలన కోసం తోట శ్రీనివాస్ సమర్థవంతంగా సేవలందిస్తారనే నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా సమాచార హక్కు ఉద్యమాన్ని మరింత విస్తరించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని, సంస్థ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిబద్ధతతో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కుటుంబం తరఫున తోట శ్రీనివాస్‌కు అభినందనలు తెలియజేస్తూ, జాతీయ కార్యదర్శిగా ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల రాఘవేందర్,



రాష్ట్ర సహాయ సమన్వయకర్త గడప కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, అరవింద్ స్వామి, రాష్ట్ర కార్యదర్శులు రావుల నవీన్ కుమార్, కేడెల ప్రసాద్, మడుపు వేణుగోపాల్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఏ. శ్రీకాంత్ రెడ్డి, శివకుమార్ గౌడ్, అశోక్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుడ్డేటి ప్రవీణ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అశోక్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు మంద సాయిబాబు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మాలలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమించాలి





- విద్యా ఉద్యోగ నియామకాల్లో వివక్ష..
- రోస్టర్ పాయింట్ 22ను సవరించి 12కు తగ్గించాలి.
- ఎంసీఎఫ్ రాష్ట్ర నేతల డిమాండ్
- రామాయంపేటలో మాలల ప్రాంతీయ సదస్సు నిర్వహణ.

**రామాయంపేట, జూలై 27 (సిరి న్యూస్)**

విద్యా, ఉద్యోగ నియామకాలలో ఎస్సీ మాలలకు అన్యాయం జరుగుతోందని, దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలని మాలల కోఆర్డినేషన్ ఫోరం (ఎంసీఎఫ్) రాష్ట్ర నాయకులు శకుంతల, తిరుపతయ్య, పిశంకర్ లు పిలుపు నిచ్చారు. మాలల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రామాయంపేటలోని శారద ఫంక్షన్ హాల్‌లో మాలల రోస్టర్ పాయింట్ల సవరణ, పరిరక్షణపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించి మాలలకు కేటాయించిన రోస్టర్ పాయింట్‌ను 22 నుంచి 12కు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల విడుదలైన గ్రూప్-2, స్త్రీనిధి, ఆర్టీసీ, పోలీస్ తదితర ఉద్యోగ నియామకాలలో మాలలకు ఒక్క ఉద్యోగం కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ విధానంలో సవరణ జరిగే వరకు కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ల జారీని నిలిపివేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, విద్యా సర్వేలో మాలల జనాభాను వాస్తవానికి తగ్గించి చూపిందని ఆరోపించారు. 2011లో 15 లక్షలుగా నమోదైన మాలల జనాభాను 2024 సర్వేలో 14 లక్షలకు తగ్గించడం వెనుక కుట్ర ఉందని, రాష్ట్రంలో మాలల జనాభా 30 లక్షలకు పైగానే ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం మాలల పట్ల వివక్షను కొనసాగిస్తే న్యాయపరమైన పోరాటంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ నిధులను దళితుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ కోసం వినియోగించాలని కోరారు. అలాగే మాలలు చిరు వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఎఫ్ జిల్లా ఇన్‌చార్జి జెల్లా సుధాకర్, జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరు సంజీవ్, మాజీ ఎంపీపీ గుండా ఎల్లం, దుబాసి సంజీవ్, మాసాయిపేట మల్లేశం, బైరం కుమార్, బైరం సిద్ధిరాములు, గావు సురేందర్, బైరం రమేష్, టంకరి రాజు, కొక్కు బాబు, బ్యాగరి చంద్రం, పద్మారావు, టంకరి ప్రశాంత్, అనుముల రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న.. జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి !

**రామాయంపేట, జూలై 27 (సిరి న్యూస్)**

హత్నూర సమీపంలోని పురాతన దత్తలయ్య గుట్టలో వెలసిన దత్తాత్రేయ స్వామి క్షేత్రాన్ని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి యు డబ్ల్యూ జె- ఐ జె యు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి సోమవారం సందర్శించారు. దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సభాపతి శర్మ ఆధ్వర్యంలో పూజారులు చంద్రప్రకాష్ శర్మ, సూర్య ప్రకాష్ శర్మ అర్చన జరిపారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ మర్యాదలతో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరిని సత్కరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... ఈ దత్తాత్రేయ క్షేత్రానికి 650 సంవత్సరాల చరిత్ర ఉన్నదని అన్నారు.ఈ క్షేత్రంలో ఏటా గురు పౌర్ణమిని పురస్కరించుకొని మూడు రోజులపాటు పెద్ద ఎత్తున బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అందుకని స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు తో పాటు పరిసర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ క్షేత్రానికి వస్తారు.ఈసారి కూడా సోమవారం ఉదయం ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, చండీ హోమం, ద్వీప ప్రజ్వలన జరిపారు. దత్తాత్రేయునికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ సభాపతి శర్మ తెలిపారు. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా టి యు డబ్ల్యూ జే (ఐ జేయు) మాజీ ప్రధాన కార్యదర్శి పానుగంటి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శివన్న జైన్ ,వెన్న చక్రేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



# గంగాదేవి జాతరకు ఘన శ్రీకారం..





- గంగాదేవి బోనాల జాతర గోడపత్రాల ఆవిష్కరణ..
- ఆగస్టు 9 జాతరకు ఎమ్మెల్యే కొక్కిరాల సురేఖకు ఆహ్వానం..
- జాతర విజయవంతానికి కాంగ్రెస్ నేతల సమిష్టి కృషి..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 27 (సిరి న్యూస్)**

మంచిర్యాలలో ఆగస్టు 9న వైభవంగా నిర్వహించనున్న శ్రీ గంగాదేవి బోనాల జాతర ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. జాతర ప్రచారంలో భాగంగా గోడపత్రాలను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. జాతర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతర నిర్వాహకులు ఎమ్మెల్యే కొక్కిరాల సురేఖను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ప్రతి ఏడాది నిర్వహించే గంగాదేవి బోనాల జాతర స్థానికంగా విశేష ప్రాధాన్యతను సంతరించుకుంటుందని, ఈసారి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ పెంట రజిత, గంగపుత్ర జిల్లా నాయకులు బోరే యాదగిరి, కునరపు చెందు, బోరే చంద్రుడు, శాకపురం చలంబాబు, గుమ్ముల సుదర్శన్, అరెందుల శ్రీనివాస్, తుంగపుత్ర యువజన నాయకులు గుమ్ముల నాగరాజు, తోకల అంజి, గుమ్ముల శ్రీనివాస్, 46వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోకల అవినాష్, రాజమల్లు తదితరులు పాల్గొని జాతర విజయవంతానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.

# ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలి

**సైబరాబాద్ :**

ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ , పరిశ్రమలు & వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ఆదేశించారు. సోమవారం దూలపల్లి వద్ద జరుగుతున్న బహదూర్‌పల్లి–కొంపల్లి రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించి ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్, జోనల్ కమిషనర్, అలాగే సీఎంసీ, హెచ్ఎండీఏ, టీజీఎస్‌పీడీసీఎల్, అటవీ శాఖ , ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. రోడ్డు విస్తరణ పనులను సెప్టెంబర్ 30లోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. దూలపల్లి , బహదూర్‌పల్లి గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ప్రతిపాదనను హెచ్ఎండీఏ సిద్ధం చేసి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు పరిశీలన , తదుపరి చర్యల కోసం సమర్పించాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న మంత్రి, అన్ని శాఖలు నిర్ణయించిన గడువులను పాటిస్తూ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

# తాడిచెర్ల-2పై ఢిల్లీలో చర్చ..

- తాడిచెర్ల-2 పనులకు వేగం పెంచాలి..
- స్థానిక యువతకు వెయ్యి ఉద్యోగాలు..
- సింగరేణి కార్మికులకు ₹10 వేల పెన్షన్..
- కిషన్ రెడ్డికి ఎంపీ, మంత్రి వినతి..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 27 (సిరి న్యూస్)**



తాడిచెర్ల–2 బొగ్గు గని ప్రాజెక్టు పనులను త్వరిత గతిన పూర్తి చేసి స్థానిక యువతకు వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి కీలకమైన తాడిచెర్ల–2 ప్రాజెక్టు అంశాలను వివరించారు. ప్రాజెక్టు ఆలస్యం కాకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గని ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు పునరావాస, పునర్నిర్మాణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన కార్మికులు ఎదుర్కొంటున్న పెన్షన్ సమస్యను పరిష్కరించి కనీసం నెలకు ₹10 వేల పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. సింగరేణి అభివృద్ధి, బొగ్గు గనుల విస్తరణ, గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై కూడా చర్చించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సంబంధిత అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ విజయవంతం




**గుమ్మడిదల, జూలై 27( సిరి న్యూస్ ):**

గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నారం పాఠశాలలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ సెకండ్ స్పెల్ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. శిక్షణ కార్యక్రమంలో తెలుగు రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీలు) ఝాన్సీరాణి, నాగరాజు, ఇంగ్లీష్ ఆర్‌పీ సిద్ధయ్య, గణితం ఆర్‌పీ టేకులపల్లి సునీత ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రెమిడియేషన్' కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో ఎలా సమర్థవంతంగా అమలు చేయాలనే అంశంపై అవగాహన కల్పించారు. రెమిడియేషన్ కార్యక్రమానికి సంబంధించిన పీరియడ్ ప్లాన్లు, అభ్యసన ఫలితాలు, బోధనా విధానాలు, విద్యార్థుల నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనా వేసే విధానాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీదేవి మేడం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు వారి అభ్యసన స్థాయిని మరింత మెరుగుపరచడానికి ఉపాధ్యాయులకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

# శ్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి..

## విద్యుత్ అధికారులకు మైనార్టీ సభ్యుల వినతి..


**హత్నూర, జూలై 27,(సిరి న్యూస్)**





మైనార్టీ సభ్యులు స్మశాన వాటికలో నెలకొన్న విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏడీ, ఏఈ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని జామా మసీద్‌కు చెందిన స్థానిక మైనార్టీ సభ్యులు వినతి పత్రంలో వివరిస్తూ గత మూడు సంవత్సరాలుగా శ్మశాన వాటికలో విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. శ్మశాన వాటికలో ఇప్పటికే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటికి విద్యుత్ తీగలు (వైర్లు) వేయకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ అందుబాటులోకి రాలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో జరిగే అంత్యక్రియలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యుత్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీంతో ప్రజలు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామి గౌడ్ సైతం విద్యుత్ శాఖ అధికారులతో ఈ విషయంపై మాట్లాడినప్పటికీ అధికారులు త్వరలో పూర్తిచేస్తామని అన్నారు.

## హైవే భద్రతకు గండి..
# అసలు లోగుట్టేంటి.?..

- జాతీయ రహదారిపై ప్రాణాలతో చెలగాటం.!..
- ఐదు చోట్ల చోరీలు.. ఒకే కేసు.!..
- కేసు నమోదు వెనుక లోగుట్టు ఏంటి.?
- హైవేపై బ్యాటరీల చోరీ.. కేసులో మిస్టరీ.!..




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 27 (సిరి న్యూస్)**


తేదీ: 14-07-2026
Received on 14/07/2026 at 20:15hrs

మంచిర్యాల జిల్లా పరిధిలోని జాతీయ రహదారి,363పై ఏర్పాటు చేసిన అత్యవసర కాల్ బాక్సుల బ్యాటరీలు దొంగిలించబడడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. ప్రమాదాల సమయంలో ప్రాణాలు కాపాడే ఈ అత్యవసర వ్యవస్థ నిర్వీర్యం కావడంతో ప్రయాణికుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నెల 12న నస్పూర్, మందమర్రి, కాసిపేట, బెల్లంపల్లి, తాండూరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని అత్యవసర కాల్ బాక్సుల నుంచి బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. జాతీయ రహదారి,363 రహదారి భద్రత సిబ్బంది ఫిర్యాదు మేరకు కాసిపేట పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని 11 బ్యాటరీలు, ఒక సుజుకి ఎర్టిగా కారు, ఒక బజాజ్ పల్సర్ 150 సీసీ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఐదు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో చోరీలు జరిగినప్పటికీ కేవలం కాసిపేట పోలీస్ స్టేషన్‌లోనే ఒకే కేసు నమోదు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరం జరిగితే అక్కడే కేసు నమోదు చేయాలని జిల్లా పోలీసు అధికారి సూచించినట్లు సమాచారం ఉన్నప్పటికీ, అది అమలుకాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాటరీలు దొంగిలించబడిన సమయంలో ప్రమాదం జరిగి ఉంటే బాధ్యత ఎవరు వహించే వారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఐదు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేయాల్సిన చోట ఒకే కేసుతో సరిపెట్టడం వెనుక అసలు కారణమేంటని స్థానికులు గుసగుసలాడుతున్నారు..

# ఆర్టీవో ఈ-చలాన్' పేరుతో సైబర్ మోసం..!

- వాట్సాప్ మెసేజ్ ఓపెన్ చేస్తే ఫోన్ హ్యాక్
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక
- గుమ్మడిదలలో కౌన్సిలర్ ఫోన్ నంబర్ హ్యాక్
- పోలీసుల తక్షణ జోక్యం కోరుతున్న గ్రామస్తులు





**గుమ్మడిదల, జులై 27 (సిరి న్యూస్ ):**


RTO_E_CHAL-LAN_CHECK_ONLINE.apk
2.5 MB
7:12 PM
ఈ RTO E CHALLAN APP యాప్ వాట్సప్ నంబర్లకు పంపుతున్నారు. అవి ఓపెన్ చేయగానే వాళ్ళ ఫోను హ్యాక్ అవడం జరుగుతుంది. హ్యాక్ అయిన వెంటనే మీ మొబైల్ లో ఉన్న కాంటాక్ట్స్ అందరికీ వాట్సాప్ ద్వారా పంపి వాళ్ళ ఫోన్లు కూడా హ్యాక్ చేస్తున్నారు. కావున ఈ RTO E CHALLAN APP ఎవ్వరు ఓపెన్ చేయకండి.
7:34 pm

సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా 'ఆర్టీవో ఈ-చలాన్' పేరుతో వాట్సాప్ ద్వారా పంపిస్తున్న నకిలీ సందేశాలు గుమ్మడిదల మండలంలో కలకలం రేపుతున్నాయి. గత రెండు రోజులుగా పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న పలువురు ప్రముఖుల మొబైల్ ఫోన్ నంబర్లకు ఆర్టీవో ఈ-చలాన్' పేరుతో అనుమానాస్పద వాట్సాప్ మెసేజ్‌లు వస్తుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు సైబర్ నేరగాళ్లు పంపుతున్న ఈ మెసేజ్‌లోని లింక్ లేదా ఫైల్‌ను ఓపెన్ చేసిన వెంటనే సంబంధిత వ్యక్తి మొబైల్ ఫోన్ హ్యాక్ అవుతున్నట్లు తెలుస్తోంది. అనంతరం ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం, కాంటాక్టులు, వాట్సాప్ వివరాలు, ఇతర డేటా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని బాధితులు చెబుతున్నారు. ఫోన్ హ్యాక్ అయిన తర్వాత బాధితుడి వాట్సాప్ ఖాతా నుంచి అతని బంధువులు, స్నేహితులు, పరిచయస్తులకు నేను అత్యవసర పరిస్థితిలో ఉన్నాను వెంటనే ఈ నంబర్‌కు డబ్బులు పంపండి అంటూ సందేశాలు పంపి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీంతో చాలామంది ఈ సందేశాలను నిజమని నమ్మి మోసపోయే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గుమ్మడిదలకు చెందిన కౌన్సిలర్ మొబైల్ ఫోన్ కూడా ఇదే తరహాలో హ్యాక్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామంలోని పలువురు ప్రజలు ఒకరినొకరు అప్రమత్తం చేస్తూ "ఆర్టీవో ఈ-చలాన్" పేరుతో వచ్చే వాట్సాప్ మెసేజ్‌లు, లింకులు లేదా ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దు అంటూ విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులు, ఏపీకే ఫైళ్లు లేదా అనుమానాస్పద సందేశాలను ఓపెన్ చేయకుండా వెంటనే తొలగించాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఫోన్ హ్యాక్ అయినట్లు అనుమానం వచ్చిన వెంటనే బ్యాంకు ఖాతాలు, యూపీఐ సేవలను భద్రపరచడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో గుమ్మడిదల ప్రాంత ప్రజలు సంబంధిత పోలీస్ శాఖ, సైబర్ క్రైమ్ అధికారులు వెంటనే దృష్టి సారించి, ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఇలాంటి సైబర్ మోసాల బారిన పడకుండా రక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అన్నారం భూములను టిజిఐఐసి కి కేటాయించొద్దు

- జిల్లా కలెక్టర్ కు అన్నారం రైతులు, గ్రామస్తుల వినతిపత్రం
- మా భూములు లాక్కోవద్దు మా జీవనాధారాన్ని కాపాడండి అంటూ అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్న రైతులు



**సంగారెడ్డి, జూలై 27 (సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామ సర్వే నంబర్ 261/1లో ఉన్న భూములను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కు కేటాయించే ప్రతిపాదనను వెంటనే ఉప సంహరించుకోవాలని కోరుతూ అన్నారం గ్రామ రైతులు, గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ కుటుంబాలు తరత రాలుగా ఈ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రస్తుతం ఆ భూములను పారిశ్రామిక అవసరాల పేరుతో స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. తమ భూములు కోల్పోతే జీవనాధారం పూర్తిగా దెబ్బతింటుందని, వ్యవసాయం తప్ప మరో ఉపాధి మార్గం తమకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నారం గ్రామంలో సర్వే నంబర్ 261/1లోని భూములను టి జి ఐ ఐ సి కి కేటాయించకుండా ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, గ్రామ ప్రజలతో చర్చించి మాత్రమే ముందుకు వెళ్లాలని కోరారు. రైతుల అనుమతి లేకుండా భూములను స్వాధీనం చేసుకోవడం అన్యాయమని, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అభివృద్ధి పేరుతో రైతులను రోడ్డున పడేయొద్దని పేర్కొన్నారు. తమ భూములు పోతే కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, రైతుల కన్నీళ్లపై పరిశ్రమలు నిర్మించకూడదని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. గ్రామ ప్రజల మనోభావాలను గౌరవించి భూముల కేటాయింపు ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా మా భూములు లాక్కోవద్దు మా భూమిలే మా బతుకు దెరువు రైతులను ఆదుకుని న్యాయం చేయాలి అంటూ రైతులు, గ్రామస్తులు అధికారులను, రాజకీయ నాయకులను విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ సమస్యను సానుకూలంగా పరిశీలించి రైతుల హక్కులను పరిరక్షించాలని వారు కోరారు.

# కాల్వలను వెంటనే పునరుద్ధరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

## చైర్మన్ కుమార్ గౌడ్

- ఎర్రచెరువు కట్టు కాల్వల పూడ్చివేతపై నిరసన
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పాలకవర్గం బైఠాయింపు
- ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ పాలకవర్గం

**గుమ్మడిదల, జూలై 27 (సిరి న్యూస్):**

చెరువులలో నీరు సమృద్ధిగా చేరి పంటలు బాగా పండాలంటే చెరువులకు ముఖ్యంగా కట్టు కాలువలే జీవనాధారం అని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రచెరువుకు జీవనాడిగా ఉన్న కట్టు కాల్వలను పూడ్చి వేయడాన్ని నిరసిస్తూ సోమవారం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. కట్టు కాల్వలను వెంటనే పునరుద్ధరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ చెరువులు నీటితో కళకళలాడి రైతులకు సాగునీరు అందాలంటే కట్టు కాల్వలే ప్రధాన ఆధారమని అన్నారు. చెరువులోకి నీరు చేరే మార్గాలను అడ్డుకోవడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో సాగు, తాగునీటి అవసరాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 109లో ప్రభుత్వం పారిశ్రామిక అవసరాల కోసం భూములను కేటాయించిన అనంతరం ఎర్రచెరువుకు నీరు చేరే ప్రధాన కట్టు కాల్వలను పూర్తిగా పూడ్చివేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలకు అత్యంత కీలకమైన ఎర్రచెరువును పరిరక్షించడం అధికారుల బాధ్యత అయినప్పటికీ, వారు తమ విధులను విస్మరించడం బాధాకరమని మండిపడ్డారు. పరిశ్రమల అభివృద్ధి పేరుతో సహజ నీటి వనరులను ధ్వంసం చేయడం సమంజసం కాదని, అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎర్రచెరువుకు నీరు వచ్చే కట్టు కాల్వలను తక్షణమే పునరుద్ధరించాలని, వాటిని పూడ్చివేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు మాధవి, నరేందర్ రెడ్డి, రమేష్, రాజశేఖర్, మురళి, సంజీవరెడ్డి, కిషన్, కుమార్ గౌడ్, జైపాల్ రెడ్డి, నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, శేఖర్ రెడ్డి, హుస్సేన్, ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# గుమ్మడిదల బస్టాండ్‌లో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగినా?

- రెండు నెలలుగా హామీలకే పరిమితం
- ప్రయాణికులు, వ్యాపారుల ఆవేదన

**గుమ్మడిదల (సిరి న్యూస్):**



మండల, మున్సిపల్ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న గుమ్మడిదల బస్టాండ్‌లో అత్యవసరమైన సులబ్ కాంప్లెక్స్ (ప్రజా మరుగుదొడ్డి) నిర్మాణం ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో ప్రయాణికులు, స్థానిక వ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు, పురపాలక పాలకవర్గం బస్టాండ్ సమీపంలోని సర్వే నంబర్ 198 ప్రభుత్వ భూమిలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థల పరిశీలన నిర్వహించి, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. అయితే ఆ హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజల్లో నిరాశకు గురవుతున్నారు. ప్రతిరోజూ గుమ్మడిదలకు వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ పరిసరాల్లో ప్రజా మరుగుదొడ్డి లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు అక్కడ వ్యాపారం నిర్వహిస్తున్న వర్తకులు కూడా ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయితే ప్రయాణికులకు కనీస మౌలిక సదుపాయం అందుబాటులోకి రావడంతో పాటు బస్టాండ్ పరిసరాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని స్థానికులు భావించారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో వారి ఆశలు అడియాశలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, ఇప్పటికే ప్రకటించిన హామీలను అమలు చేస్తూ సులబ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని ప్రజలు పురపాలక పాలకవర్గం, సంబంధిత అధికారులను కోరుతున్నారు. అభివృద్ధి అంటే కేవలం ప్రకటనలు కాదు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సకాలంలో కల్పించడమే నిజమైన అభివృద్ధి అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన నిర్మాణ పనులు చేపడితే వేలాది మంది ప్రయాణికులకు, స్థానికులకు శాశ్వత ఉపశమనం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సర్వే నం.261 ప్రభుత్వ భూమికి తక్షణమే సర్వే నిర్వహించాలి

- తహసీల్దార్ తో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వార్డు కౌన్సిలర్ల సమావేశం
- ప్రభుత్వ భూముల పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచన

**గుమ్మడిదల, జులై 27 (సిరి న్యూస్ ):**



అన్నారం గ్రామంలో ప్రభుత్వ భూములపై ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, ప్రభుత్వ భూములను గుర్తించాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తహసిల్దారును కోరారు. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని అన్నారం గ్రామంలోని సర్వే నంబర్ 261లో ఉన్న ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో గుర్తించేందుకు వెంటనే సర్వే నిర్వహించాలని సోమవారం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో వార్డు కౌన్సిలర్లతో కలిసి తహసీల్దార్ పరమేశంను కలిసి చర్చించారు. సర్వే నంబర్ 261లో ప్రభుత్వ భూముల వివరాలను సమగ్రంగా గుర్తించి, రికార్డులను స్పష్టంగా నమోదు చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అన్నారం గ్రామంలో ప్రభుత్వ భూములపై ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, ప్రభుత్వ భూములను గుర్తించి వాటి రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కుమార్ గౌడ్ సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు మాధవి, నరేందర్ రెడ్డి, మురళి, సంజీవరెడ్డి, కిషన్, రమేష్, కుమార్ గౌడ్, జైపాల్ రెడ్డి,నాయకులు గోవర్ధన్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, హుస్సేన్, శేఖర్ రెడ్డి, కృష్ణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో ఉద్యోగమే కాదు..

# వ్యాపారమూ చేయొచ్చు!



చాలామంది ఉన్నత చదువులు చదివిన యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తారు. అందుకోసం ఎంతో కష్టపడతారు. కానీ.. అవి కొందరికే దక్కుతాయి. మిగతావారికి అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి. దాంతో చదివిన చదువు మరే రంగంలో ఉపయోగపడుతుందా? అని కొత్తగా ఆలోచనలు చేస్తున్నారు నేటి యువత. అందులో ఈమె కూడా ఒకరు. ఉద్యోగం రాలేదని దిగులుపడకుండా.. తనకున్న తెలివితో, ఏదైనా సాధించాలనే పట్టుదలతో వ్యాపారం ప్రారంభించింది. అందులో లాభాల బాట పడుతోంది. ఆమెవరో కాదు.. సూర్యాపేట జిల్లాకు చెందిన కొమ్మనబోయిన యామిని.

**సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లి ఆమె స్వస్థలం. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నుంచి బయోకెమిస్ట్రీలో పీజీ పూర్తి చేసింది. చదువు పూర్తవగానే పోటీపరీక్షలకు రెడీ అయింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే చిరకాల కోరికను నేరవేర్చుకోవాలనుకుంది. కానీ, మరో వైపు ఏదైనా సొంతంగా చేయాలనే ఆసక్తి కూడా ఉండేదట. దాంతో.. ఎలాగూ ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు ఆలస్యమవుతున్నాయి కదా సొంత వ్యాపారంపై దృష్టి పెట్టింది.**



**భర్త ప్రోత్సాహంతో..**


మామూలుగా ఎవరికైనా ఎన్నో ఆలోచనలు, ఆశలు, కలలు ఉండొచ్చు. కానీ, వాటిని చేయడానికి వెన్నుతట్టి ప్రోత్సహించేవారు కూడా ఉండాలి. అలాంటి సపోర్ట్ యామినికి దొరికింది. ఆమె భర్త డాక్టర్ ప్రేమ్‌చంద్. ఆమె కోరికను నెరవేర్చడంలో భాగమయ్యారు. ఇద్దరూ కలిసి వ్యాపారం గురించి ఎన్నో ఆలోచనలు చేశారు. ఏది చేసినా ప్రత్యేకంగా ఉండాలి అనుకున్నారు. దాంతో ఆమెకి పుట్టగొడుగుల పెంపకం బాగుంటుంది అనిపించింది. అందుకు కారణం కూడా ఉంది. చదువుకునేటప్పుడు ప్రాక్టికల్స్ సమయంలో వీటి ఆరోగ్య ప్రయోజనాలు ఆమెని ఆకర్షించాయట. నేర్చుకున్న దానికి సార్థకత కూడా ఉంటుందనిపించి ఆ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు.



**అద్దె ఇంట్లో అగచాట్లు తట్టుకుని..**

ఏడాదిక్రితం రూ.5వేలతో వీటి సాగు మొదలుపెట్టింది. తొలిరోజుల్లో పుట్టగొడుగులు పెరగడానికి ఏర్పాటు చేసిన బెడ్లు పదే పదే పాడయ్యాయి. దీంతో నష్టమొచ్చింది. ప్రతి దశనీ నోట్ చేసుకుంటూ లోపాలను సరిదిద్దుకుంటూ మళ్లీ మళ్లీ ప్రయత్నించింది యామిని. ఫైనల్‌గా విజయం సాధించింది. కానీ తామున్నది అద్దె ఇంట్లో. బెడ్లకు నీరు పడుతుంటే గోడలు తడుస్తాయని యజమాని వాళ్లపై కోపగించేవారు. అయినాసరే అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే సాగు కొనసాగించిందామె. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడంతో చుట్టుపక్కలవాళ్లే కేజీ రూ.400 వరకూ పెట్టి తీసుకునేవారు. అదిచ్చిన ఆత్మవిశ్వాసంతో తొర్రూరులో సొంతింటికి చేరుకుంది యామిని.

తర్వాత రూ.50వేల పెట్టుబడితో మూడు గదుల్లో పెంపకం ప్రారంభించింది. 250 వరకు బెడ్లు ఏర్పాటు చేసింది. విత్తనాలను బెంగళూరు ఐఐహెచ్ఆర్ నుంచి తీసుకొచ్చింది. రేగడి మట్టి, కొబ్బరిపొట్టు, వరి గడ్డి, సున్నం వాడి పాలిథిన్ కవర్లలో పుట్టగొడుగులను పెంచుతోంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే 45 రోజుల్లో పంట చేతికొస్తుంది. అయితే తొలి 21 రోజులు చీకటి గదిలో ఉంచి, మిగిలిన రోజుల్లో గాలి, వెలుతురు అందేలా చూసుకోవాలి. చుట్టుపక్కలవాళ్లే కాదు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారానూ ఆర్డర్లు వస్తున్నాయి ఇప్పుడు. అంతేకాదు.. బెంగళూరు, హైదరాబాద్, వరంగల్ వంటి పట్టణాలకూ పంపుతోందట యామిని. నెలకు రూ.20వేల వరకూ ఆదాయం వస్తోంది అని సంతోషంగా చెప్తోంది యామిని.





**డ్రై మష్రూమ్స్**

మామూలుగా పుట్టగొడుగుల్ని తాజాగానే వంటకు ఉపయోగిస్తుంటాం. అయితే, యామిని ముదిరిన వాటిని ఎండబెట్టి, 'డ్రై మష్రూమ్స్' చేస్తోంది. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ ఉంటుందట. తనను చూసి చాలామంది మహిళలు వారికీ పుట్టగొడుగుల సాగు నేర్పమని అడుగుతున్నారట. దీనిపై మరింత పట్టు తెచ్చుకోవడానికి బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి ఇంటర్న్‌షిప్ కూడా చేస్తోందట ఆమె. అది పూర్తయ్యాక శిక్షణ కూడా ప్రారంభించాలనుకుంటోంది. ఆమె కొందరికైనా తన ద్వారా ఉపాధి కలిగించాలనుకుంటోంది. ప్రతి ఒక్కరూ చదువుతోనే ఏదైనా సాధించాలంటే చాలామంది కథ అంతటితో ముగిసిపోయేది. కానీ.. యామినిలాంటి పట్టుదల, స్థిరత్వం, కాంక్ష ఉంటే.. అనుకున్నదే తడవు ఏదైనా ఇట్టే సాధించేస్తారు అనడానికి ఈమె కథే స్ఫూర్తి.




# హార్మోన్లు సమతుల్యంగా..

- ఈ మధ్యకాలంలో చాలామందికి హార్మోన్ల అసమతుల్యత సమస్య వేధిస్తోంది. అయితే, దీనికి కారణం లైఫ్ స్టయిల్ ఛేంజెస్. కాబట్టి మన జీవనశైలిని క్రమబద్ధీకరణలో పెట్టుకుంటే హార్మోన్లు కూడా సమతుల్యంగా ఉంటాయనేది నిపుణుల సలహా. మరి అదెలాగ? అంటే..
- నిద్రలేమి వల్ల హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. కాబట్టి రోజుకి కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి.
- ఒకవేళ హార్మోన్ల అసమతౌల్యత ఏర్పడితే.. వాకింగ్, స్విమ్మింగ్.. లాంటి వ్యాయామాలు చేయాలి. ఇలా చేయడం వల్ల కొద్ది కాలంలోనే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.
- తినే ఆహారంలో కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, ప్రొటీన్లు తగినంత మేర ఉండేలా చూసుకోవాలి. రోజూ రెండుమూడు రకాల కూరగాయలు, పండ్లు తీసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు.. ఎందుకంటే వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలోని ఇన్సులిన్ స్థాయిని సమన్వయపరుస్తుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండే బొప్పాయి, యాపిల్, జామ పండ్లను ఎక్కువగా తినాలి.
- శరీరంలో వివిధ హార్మోన్లు ఉత్పత్తి కావడానికి కొబ్బరి నూనె కూడా ఉపయోగపడుతుంది. అంతేకాదు.. దీన్ని ఆహారంలో భాగంగా తీసుకుంటే బరువు తగ్గే అవకాశం కూడా ఉంటుంది.
- శరీరంలో హార్మోన్ల ఉత్పత్తికి, వివిధ కణాలు తిరిగి నిర్మితమవడానికి కొవ్వులు ఉపయోగపడతాయి. ఈ క్రమంలో వెజిటబుల్ ఆయిల్స్‌లో పాలీశ్యాచురేటెడ్ కొవ్వులు అధిక మొత్తంలో ఉంటాయి.
- రసాయనాలు, క్రిమి సంహారక మందులు, ప్లాస్టిక్ మొదలైన వాటిలో విష పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి సాధ్యమైనంత వరకు ఇలాంటి వాటిని వాడకపోవడమే బెటర్.
- పదే పదే కాఫీ తాగకూడదు. ప్రత్యేకించి గర్భవతిగా ఉన్నప్పుడు కాఫీ తాగితే కొన్ని సందర్భాల్లో అది ఆరోగ్యం పైన దుష్ప్రభావం చూపించొచ్చు.
- హార్మోన్లు సమతులంగా ఉంటే శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. అంతేకాకుండా ఎలాంటి ఆరోగ్య సమస్యలూ దరిచేరవు.

# నైట్ డ్యూటీ చేస్తున్నారా?



నైట్ షిఫ్టులు చేస్తే జరిగే ప్రమాదలను తెలియజేస్తూ వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఓ జర్నల్‌ని ప్రచురించారు. వరుసగా మూడు రోజులు నైట్ షిఫ్ట్ చేయడం ద్వారా మధుమేహం, స్థూలకాయం ఇతర జీవక్రియ రుగ్మతల బారిన పడతారట.


**వీటిపై ప్రభావం..**

మెదడు పనితీరు సైతం మందగిస్తుంది.
హృదయ స్పందనలు క్రమం తప్పుతాయి.
జీవ సమతుల్యత దెబ్బతింటుంది.
రక్తంలో గ్లూకోజ్ నియంత్రణలో ఉండదు.
బీపీ, గుండె జబ్బులు వచ్చి..
చివరికి హార్ట్ ఎటాక్‌కి దారి తీయవచ్చు.

పరిశోధకులలో ఒకరైన ప్రొఫెసర్ హన్స్ వాన్ డాంగెన్ నైట్ షిఫ్టుల వల్ల కలిగే తీవ్ర పరిణామాలను చెప్పారు.శరీరంలో ప్రోటీన్ లయలను అస్తవ్యస్తంగా మార్చడానికి వరుసగా మూడు రాత్రి షిఫ్టులు సరిపోతాయని, ఇది దీర్ఘకాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. పరిశోధన బృందం రక్త నమూనాలను ఉపయోగించి శరీర రోగనిరోధక వ్యవస్థ, గ్లూకోజ్ నియంత్రణకు సంబంధించిన కీలకమైన ప్రోటీన్‌లను గుర్తించింది. కొన్ని ప్రోటీన్‌లు నైట్ షిఫ్ట్‌ల ద్వారా ప్రభావితం కానప్పటికీ, వాటి లయల్లో గణనీయమైన మార్పులను సంభవించాయి.



కాబట్టి మొత్తానికి చెప్పేదేంటంటే.. నైట్ షిఫ్ట్ డ్యూటీలు చేసేవారు ఆరోగ్యకర ఆహారం తీసుకుంటూ, పగటిపూట సరిపడే నిద్ర పోవాలని చెప్తున్నారు. వ్యాయామం కూడా చేస్తే ఇంకా బెటర్ అని పరిశోధకులు చెప్పారు.





# జైనాబ్‌పై అలాంటి విమర్శలు..

అక్కినేని అఖిల్, జైనాబ్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. గత ఏడాది జూన్‌లో పెద్దల సమక్షంలో ఘనంగా వివాహం చేసుకున్న ఈ జంటపై ఇప్పటికీ దారుణమైన ట్రోలింగ్ జరుగుతోంది. అయితే పెళ్లి నాటి నుంచి వారి మధ్య ఉన్న వయసు వ్యత్యాసం, మతం వంటి విషయాలపై సోషల్ మీడియాలో నిరంతరం విమర్శలు వస్తున్నాయి. ఈక్రమంలో.. తాజాగా ఈ తీవ్రమైన ట్రోలింగ్‌పై అఖిల్ మొదటిసారి స్పందించారు. తమ మధ్య ఉన్న వయసు, మతం వంటి విషయాలు తనకు ఏమాత్రం సమస్య కాదని అఖిల్ స్పష్టం చేశారు. పెళ్లికి ముందే వీటన్నింటిపై తామిద్దరం స్పష్టంగా చర్చించుకున్నామని చెప్పారు. కొన్ని నెలల పాటు వచ్చే ట్రోలింగ్ గురించి ఆలోచించాలా లేదా రాబోయే 50 ఏళ్ల తమ సంతోషకరమైన జీవితం గురించి ఆలోచించాలా అని ఆలోచించి, నెగెటివిటీని పట్టించుకోవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పెళ్లి తర్వాత ఇలాంటి పోస్టులు వస్తాయని ముందే జైనాబ్‌కు చెప్పి మానసికంగా సిద్ధం చేశానని, వచ్చిన ప్రతి ట్రోల్‌ను ఒక దీవెనగా భావించామని అన్నారు. కులం, మతం, వయసు కంటే తమ మధ్య ఉన్న ప్రేమ, అవగాహనే గొప్పదని ఆయన పేర్కొన్నారు. తాను మానసికంగా, శారీరకంగా కష్టాల్లో ఉన్న సమయంలో జైనాబ్ ఇచ్చిన సపోర్ట్ వల్లే తమ బంధం మరింత బలపడిందని చెప్పారు. సోషల్ మీడియా ట్రోల్స్ నుంచి ఆమెను రక్షించనప్పటికీ, జైనాబ్ ఈ విషయంలో ఎంతో పరిణతితో వ్యవహరించిందని ప్రశంసలు కురిపించారు. తమ ఐదేళ్ల రిలేషన్‌షిప్‌లో ఆమె తనను బాగా అర్థం చేసుకుందని వెల్లడించారు. కాగా.. అఖిల్ సినిమాల విషయానికొస్తే.. గత కొద్ది కాలంగా ఫ్లాపుల్లో ఉన్న ఆయన ఇటీవల లెనిన్ చిత్రంలో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖఆతాలో వేసుకున్నారు. మురళి కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద భారీ కలెక్షన్స్ కూడా రాబట్టింది. మూడేళ్ల గ్యాప్ తర్వాత గట్టి కంబ్యాక్ ఇచ్చిన అఖిల్ అయ్యాగారే నంబర్‌వన్ అని

# మెగా కోడలు లావణ్య త్రిపాఠి లుక్‌పై ట్రోలింగ్..



టాలీవుడ్ హీరోయిన్ లావణ్య త్రిపాఠి, మెగా హీరో వరుణ్‌తేజ్ కొన్నేళ్ల పాటు ప్రేమించుకుని, పెద్దల సమక్షంలో ఘనంగా పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట పర్సనల్ లైఫ్‌ను ఎంతో ఆనందంగా గడుపుతున్నారు. ఇక గతేడాది ఈ మెగా కపుల్ జీవితంలోకి ఒక బుజ్జాయి అడుగుపెట్టాడు. వీరికి ఓ పండంటి మగబిడ్డ జన్మించగా, ఆ బాబుకి 'వాయువ్ తేజ్' అని నామకరణం చేసి తమ బిడ్డతో ఎంతో సంతోషంగా గడుపుతున్నారు. అయితే తల్లి అయిన తర్వాత మెగా కోడలు లావణ్య త్రిపాఠి సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చారు. పూర్తిగా తన కొడుకు బాగోగులు చూసుకుంటూ ఇంట్లోనే సమయాన్ని గడుపుతున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి లావణ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న లావణ్య, గతంతో పోలిస్తే కొంత బరువు పెరిగి బొద్దుగా కనిపించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్‌గా మారాయి. అయితే అది చూసిన కొందరు నెటిజన్లు దారుణమైన ట్రోలింగ్ మొదలుపెట్టారు. ఒక్క బిడ్డను కనగానే ఆంటీలా మారిపోయిందంటూ ఆమె రూపాన్ని హేళన చేస్తూ అసభ్యకరమైన కామెంట్లు పెడుతున్నారు. ఈ దారుణమైన ట్రోలింగ్‌పై మెగా అభిమానులు, నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గర్భధారణ, ప్రసవం తర్వాత ఏ మహిళ శరీరంలోనైనా మార్పులు రావడం పూర్తిగా సహజమైన విషయమని స్పష్టం చేస్తున్నారు. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ప్రతి తల్లి శారీరకంగా, మానసికంగా పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం ఖచ్చితంగా అవసరమని గుర్తు చేస్తున్నారు. మహిళల శరీరంలో వచ్చే ఇలాంటి సహజమైన మార్పులను సమాజం గౌరవించాలని, అంతేకానీ అలాంటి పవిత్రమైన సమయంలో ఒక మహిళ రూపాన్ని హేళన చేయడం, బాడీ షేమింగ్ చేయడం ఎంతమాత్రం సరికాదని ట్రోలర్లను గట్టిగా హెచ్చరిస్తున్నారు.



# అది నా విషయంలో జరిగాకే తెలుసుకున్నా!: అదాశర్మ

వైవిధ్యమైన చిత్రాలతో.. తెరపై కొత్తదనం నిండిన పాత్రల్లో కనిపిస్తూ తనదైన నటనతో ఆకట్టుకుంటుంది హీరోయిన్ అదాశర్మ. ఇప్పుడామె భాషలతో సంబంధం లేకుండా విభిన్నమైన జానర్లలో అలరించేందుకు సిద్ధమవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ప్రాంతీయ పరిశ్రమలు బలమైన నాయికా ప్రాధాన్య పాత్రలను అందిస్తున్నాయా అనే ప్రశ్నకు స్పందిస్తూ...''మంచి కథలు ఏ పరిశ్రమ నుంచైనా రాగలవని అనుకుంటున్నాను. హిందీ, తెలుగు ఇప్పుడు మరాఠీ చిత్రసీమలో పనిచేసే అవకాశం నాకు దక్కింది. ప్రతి పరిశ్రమ నాకు గుర్తుండిపోయే నాయికా ప్రాధాన్య పాత్రలనే ఇచ్చింది. మన ఖాతాలో ఒక సినిమా హిట్ అయ్యాకే.. అందరికీ మన నటనపై నమ్మకం పెరుగుతుంది. భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు ఇస్తారు. ఇది నా విషయంలో జరిగాకే తెలుసుకున్నా. అందుకే ప్రతి నటి కోరుకునే సవాలుతో కూడిన భిన్నమైన పాత్రలు నాకు దక్కుతున్నాయ''ని చెప్పింది. అదా 'గజ్రా' అనే మరాఠీ చిత్రంతోపాటు, 'సూపర్ వెల్లి' అనే సూపర్ హీరో సినిమాతో త్వరలోనే ప్రేక్షకుల్ని పలకరించనుంది.



# మీరు మీలా ఉంటే.. చాలు

చిత్రసీమలో దక్షిణాది నుంచి ఉత్తరాది వరకూ.. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ వైవిధ్యమైన పాత్రలతో సినీప్రియుల్ని అలరిస్తోంది అందాల తార రష్మిక. అగ్రతారల సరసన అవకాశాలను అందిపుచ్చుకుంటూనే నాయికా ప్రాధాన్య చిత్రాలను తన ఖాతాలో వేసుకుంటుంది. పాన్ ఇండియా స్థాయిలో కథానాయికగా సత్తా చాటుతున్న ఈ భామ ఇటీవల ఓ కార్యక్రమంలో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. "ఏ మూస పద్ధతిలోనూ ఇమడకుండా పూర్తిగా కొత్త చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం నా జీవితంలోని అద్భుతమైన ప్రయాణం. ఆ సమయంలో నా చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరికీ ఓ ప్రణాళిక ఉండేది. అందుకే నాకు మొదట్లో భయంగా అనిపించింది. కానీ, నేను నా అంతరాత్మ చెప్పిందే అనుసరించేదాన్ని. కెరీర్‌లో ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అదే నా ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలిపిందని అనిపిస్తుంది. మనల్ని ఇతరుల నుంచి భిన్నంగా చూపే విషయాలే మనకు అతిపెద్ద బలం అని తెలుసుకున్నాను. అందరిలో కలిసిపోవాలనుకుని.. వారితో ప్రతి విషయంలోనూ ఇమిడిపోవాల్సిన అవసరం లేదు. మీరు మీలా ఉంటే చాల"ని చెప్పుకొచ్చింది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.